ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 5 జనవరి 2025



బాడీ ఫ్రీజర్లకు మరమ్మతులు

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మృతదేహాలను ఉంచే బాడీ ఫ్రీజర్లకు మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో మూడు బాడీఫ్రీజర్లు ఉన్నప్పటికీ కొంతకాలంగా పనిచేయడం లేదు. దీంతో మరమ్మతు చేయించి ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. బాడీఫ్రీజర్లు కావాల్సి న వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, చిరునామా తదితర వివరాలు సమర్పించి ఉచితంగా తీసుకువెళ్లవచ్చని తెలిపారు. ఈ సేవలు పొందడానికి ఫోన్ నంబరు 9603666444, టోల్ ఫ్రీ నంబర్ 18004257062లను సంప్రదించాలని కోరారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

అవనిపై విరిసిన హరివిల్లు

ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన



ముగ్గు వేస్తున్న మొదటి బహుమతి విజేత సీపెల్లి ఇందు



ముగ్గు వేస్తున్న రెండవ బహుమతి విజేత గాదె లలిత



ముగ్గు వేస్తున్న మూడవ బహుమతి విజేత పందిర్ల స్వప్న



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

● సంక్రాంతి పండుగను ప్రతిబింబించిన ముగ్గులు..

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'.. స్థానిక పార్టనర్ అల్ఫోర్స్ హైస్కూల్ సుల్తానాబాద్, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి సహకారంతో శుక్రవారం నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ అల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిం చారు. ఆకాశంలో పరుచుకునే హరివిల్లు అవనిపై విరిసి నట్లుగా.. సంక్రాంతి పండుగ నేపథ్యం.. రంగు రంగుల చుక్కల ముగ్గులు. గొబ్బె మ్మలు, పాల పొంగు, భోగి మంటలు, హరిదాసుల కీర్తనలు, గంగి రెద్దుల విన్యాసాలు.. తెలం గాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు.. భ్రూణ హత్యలను నివా రించాలనే సందేశాలతో మహిళలు వేసిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలకు పెద్దపల్లి, ఎలిగేడు, కాల్వశ్రీరాంపూర్, జూల పల్లి, సుల్తా నాబాద్, గోదావరిఖని, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి 92 మంది మహిళలు, యువతులు హాజరై ఉత్సాహంగా ముగ్గులు వేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి..

● పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



తెలంగాణ అంటేనే సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా దేశంలో పేరుందని, వీటిని పరి రక్షించుకోవాలని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ముగ్గుల పోటీ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో చాలామంది ముగ్గులు వేసేవారని, ఆ తర్వాత పట్టణాల్లో వేయడం ప్రారంభమైందని, ఈతరం అమ్మాయిలకు ముగ్గుల ప్రాశస్త్యం గురించి వివ రించే ందుకు ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీ ద్వారా మహిళల్లో సంస్కృతి సంప్రదాయాలను సమాజానికి చాటి చెప్పారని వీటిని పరిరక్షించుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలంగాణలో ప్రతి ఇల్లు ముగ్గులతో, హరిదాసులతో, పూజలతో కళకళలాడతాయని అన్నారు. ఆ సంస్కృతిని ఆ సంప్రదాయాన్ని ప్రతి ఒక్కరు ఆచరించే విధంగా ముగ్గులు వేశారని కొని యాడారు. అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శంగా తెలంగాణ పండుగలు..

● అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వుట్కూరి నరేందర్‌రెడ్డి



తెలంగాణ ప్రజలు జరుపుకునే పండుగలు, ఆచరించే సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వుట్కూరి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాల వారికి అందించడంలో భాగంగా ఆంధ్రజ్యోతి వారు ఈ ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా నలు మూలల నుంచి ఇక్కడి వచ్చి ముగ్గులు వేసి ప్రతి ఒక్కరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఈతరం పిల్లలకు స్ఫూర్తి వంతంగా నిలుస్తుందని అన్నారు.

● మొదటి బహుమతి గెలుచుకున్న ఇందు..

ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న గోదావరిఖనికి చెందిన సీపెల్లి ఇందుకు రూ. 6 వేల నగదు, రెండవ బహుమతి గెలుచుకున్న ఎలిగేడుకు చెందిన గాదె లలితకు రూ.4 వేల నగదు, మూడవ బహు మతి గెలుచుకున్న కరీంనగర్‌కు చెందిన పందిర్ల స్వప్నకు రూ. 3 వేల నగదు, ప్రత్యేక బహుమతి గెలుచుకున్న బి విజయలక్ష్మి రూ. 2 వేల నగదును అతిథులు అందజేశారు. కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్న 20 మందితో పాటు మిగతా వారికి పార్టిసిపేషన్ బహుమతులను ఎమ్మెల్యే విజయరమణారావు

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

7న మహా కళా ప్రదర్శన

కళ్యాణ్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాదిగ కళాకారుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహా కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, ప్రజా గాయకుడు రామాంచ భరత్ పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగ కళాకారుల సన్నాహక సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాముకుంట్ల భాస్కర్, వెంకటస్వామి, గాజుల రమేష్, దూడపాక సతీష్, పులిపాక దేవేందర్, పొయిల రాజు, వెంకటస్వామి, రమేష్, రత్నం, ఎల్లయ్య, మంథని చందు, పల్లె బాపు, వడ్డేపల్లి శంకర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన పుట్ట మధు

మంథని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

ఎలిగేడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆయన నివాసంలో జిల్లా పీఆర్‌టీయూటీఎస్ నాయకులు శనివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ సయస్యలను వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్, ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, ఎలిగేడు మండల అధ్యక్షుడు మిట్టపల్లి యుగేందర్, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు జడల సత్యనారాయణ, కార్యదర్శి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అభినందలు

ఎలిగేడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అలువాల ఉషారాణి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సందర్భంగా శనివారం ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు పాఠశాలలో అభినందించారు. హెచ్‌ఎం గండ్ర దేవేందర్‌రావు, జడల సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



సుల్తానాబాద్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో చేపడుతున్న పలు రోడ్లు, డ్రైనేజీల నూతన నిర్మాణాలను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో ఇప్పటికే రూ.15కోట్లతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి శాంతినగర్ వరకు రూ.2.70కోట్లను మంజూరు చేసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయం చౌరస్తాలను ఐర్లాండ్ నమూనాలో అభివృద్ధి చేస్తామని, మధ్యలో డివైడర్ నిర్మిస్తామని చెప్పారు. ఇందుకోసం అదనంగా రూ.2.50 కోట్ల నిధులను సమకూర్చనున్నట్టు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతాకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పారిశుధ్యంపై పటిష్టమైన చర్యలు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్యంపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు అదనపు కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ చెప్పారు. శనివారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. సూపర్‌వైజర్లు పారిశుధ్యంపై క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పారిశుధ్యాన్ని రోజూ పరిశీలించాలని, రామగుండాన్ని చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మల్కాపూర్‌లోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ భవనాన్ని సందర్శించారు. 2వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తనిఖీచేశారు. రెండు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ శివానంద్, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఈఈ రామన్ ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఉద్యోగులు శిబిరం నుంచి పెద్దపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాక్ అధ్యక్షుడు తిప్పని తిరుపతి, కుంభాల సుధాకర్, సంధ్యారాణి, రాజ్‌కుమార్, మల్లన్న, రవిరాజ్, సంపత్, రహీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం వినూత్న రీతిలో బస్సులో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు సునిత, సురేష్, రాజు, కవిత, కుమారస్వామి, ప్రేమ్‌సాగర్, విజయలక్ష్మి, రాజలక్ష్మి, దుర్గప్రసాద్, శ్రీలత, దీపరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

-7047 కేసుల నమోదు.. రూ.72.77 లక్షల జరిమానా - సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారులపై నిర్ణీత వేగానికి కళ్లెం వేశామని, అధిక వేగంతో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాను విధించామని తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో మూడు స్పీడ్ గన్ కెమెరాలను ఏర్పాటు చేశామని, 2024లో రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 2460కేసులు, రూ.25.46లక్షల జరిమానా, పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1505 కేసులు, రూ.15.57లక్షల జరిమానా, మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో 3082కేసులు, రూ.31.73 లక్షల జరిమానా విధించినట్టు చెప్పారు. కమిషనరేట్ వ్యాప్తంగా నిత్యం ప్రమాదాలు జరిగితే 53 ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తించడం జరిగిందని, ఈ బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలు జరుగకుండా పోలీసుల ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధిక వేగంతో వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానా విధించడం జరిగిందని సీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హైవేలు, రద్దీగా ఉండే రహదారులపై కూడా స్పీడ్ గన్ ద్వారా వాహనాల వేగాన్ని బట్టి కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకుని నిర్దేశించిన వేగంతో వెళ్లాలని సూచించారు. అధిక వేగంతో వెళ్లి ప్రమాదాల భారిన పడవద్దని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ గమ్య స్థానాలకు చేర్చాలని కోరారు.

సుల్తానాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించి, మున్సిపాలిటీ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరయ్యే విధంగా జాగ్రత్తలు పాటించాలని, వారి పనితీరును ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపాలిటీలో పన్నుల వసూలు అసెస్మెంట్ సమీక్షించుకొని 100 శాతం పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సుల్తానాబాద్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న తరగతి గదులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలో నూతన డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కాట్నపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం

పెద్దపల్లిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ మమతారెడ్డి అధ్యక్షతన జరిగింది. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ పారిశుధ్యసిబ్బందికి దుస్తులు, టవల్స్, గ్లౌజ్‌లు, సబ్బులు, నూనే ఇతరత్రా సామగ్రి కొనుగోలు కోసం 3 లక్షల 47 వేల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు అమోదించారు. ఈ సమావేశంలో మేనేజర్ శివప్రసాద్, వైస్‌చైర్‌పర్సన్ నాజ్మీన్ సుల్తానా, భూతగడ్డ సంపత్, లైశెట్టి భిక్షపతి, శ్రీనివాస్, పురుషోత్తం, చంద్రమౌళి, ఫహీం, జావీద్, ఉప్పు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పురస్కారం ప్రదానం


ప్రశంసాపత్రం, షీల్డ్‌తో యాదగిరి శ్రీనివాస్

రామగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ సంక్రాంతి పురస్కారం అందుకున్నారు. సేంద్రియ విధానంలో పురాతన వరి విత్తనాలు సాగుచేసి భవిష్యత్ తరాల కోసం భద్రపరుస్తున్న రైతు కేటగిరిలో పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా కేంద్రం సమీప వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన సంక్రాంతి పురస్కారాల్లో శ్రీనివాస్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీనివాస్‌ను మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, రేండ్ల శారద, కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, మాజీ వార్డుసభ్యుడు వేణుగోపాల్ అభినందించారు.

రాగి వైర్లు చోరీ

చొప్పదండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ శివారులోని మెగా ఇంజనీరింగ్ కంపెనీలో సింగిల్ కోర్ రాగివైర్లు, రాగి బస్ బార్లు చోరీకి గురయ్యాయి. 21 లక్షల 54 వేల రూపాయల విలువ గల వైర్లు, బార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కంపెనీ మెకానికల్ ఇంజనీర్ నేనావత్ గోపాల్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

బాలిక కిడ్నాప్

జగిత్యాలరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల మేరకు సదరు బాలిక జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంది. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి బాలికను కిడ్నాప్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీజన్ ప్రారంభంలోనే..

- మామిడి రైతుల్లో దిగులు..
- చెట్లకు నామమాత్రపు పూత
- ప్రతీ సీజన్‌లో తప్పని తిప్పలు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న అధికారులు
- తగ్గనున్న దిగుబడిపై అన్నదాతల ఆందోళన


నామమాత్రంగా ఉన్న మామిడి పూత

జగిత్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో మామిడి రైతులకు దిగులు మొదలైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మామిడి పూత రాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో పచ్చి పూత దశలో ఉండడం, ఇంకొన్ని ప్రాంతాల్లో పూత రాలుతుండడం వంటివి చోటుచేసుకున్నాయని రైతులు అంటున్నారు. పూత ఆలస్యంగా రావడం, రాలుతుండడం కారణంగా దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా రైతులు మామిడిని సాగు చేస్తున్నారు.

మామిడి సాగులో రెండో స్థానం....

రాష్ట్రంలో ప్రస్తుత సీజన్‌లో 2.91 లక్షల ఎకరాలకు పైగా రైతులు మామిడి సాగు చేస్తున్నారు. సుమారు 55 వేల ఎకరాల్లో సాగు చేస్తూ జగిత్యాల జిల్లా మామిడి స్థానంలో రెండో స్థానంలో ఉంది. పెట్టుబడి ఖర్చులు భరించే స్థోమత ఉన్న రైతులు సొంతంగా మామిడి తోటలను నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న వారు తోటలు పూతరావడానికి ముందే లీజుకు ఇస్తున్నారు. ఈసారి పూత ఆలస్యంగా వస్తుండడంతో అటు రైతులు, ఇటు లీజు దారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈసారి ఎకరాకు 3 నుంచి 3.5 టన్నుల వరకు దిగుబడి రావచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. పెట్టుబడి ఖర్చులు వస్తాయోలేదోనని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా మామిడికి పూత సరిగా రాకపోవడం, వచ్చినా నిలవకపోవడం వల్ల రైతులకు ఆశించిన దిగుబడి రావడం లేదు.

కలిసి రాని వాతావరణ పరిస్థితులు...

మామిడి పూత సాధారణంగా నవంబర్ చివరి వారం నుంచి ప్రారంభమై జనవరి మొదటి, రెండో వారం వరకు వస్తుంటుంది వాతావరణంలో మార్పులు ఏర్పడి పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో భారీగా వ్యత్యాసం ఉండడం సైతం పూతపై ప్రభావం చూపుతోంది. పూత విచ్చుకునే దశలో చలి ప్రభావంతో పొడి వాతావరణం ఉండడం లేదు. జనవరి మొదటి వారంలో సైతం పూత ఆశించిన మేరకు రాకపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

మామిడి పంటకు తెగుళ్లు సోకడం వల్ల మున్ముందు మామిడి కాయల దిగుబడి తగ్గుతుందన్న ఆందోళనలో రైతాంగం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రతీ యేటా సుమారు రూ. 400 కోట్ల మామిడి వ్యాపారం జరుగుతుంటుంది. ఇక్కడ నుంచి మామిడి కాయలను ముంబాయి, బెంగుళూరు, చెన్నయి, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. మామిడికి మద్దతు ధరను ప్రకటించమని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

వాతావరణ మార్పులతోనే దిగుబడిపై ప్రభావం

- జంగిటి రాజేందర్, మామిడి రైతు, బండలింగాపూర్, జగిత్యాల జిల్లా



ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా పూత, కాతపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందాల్సి వస్తోంది. ముందుగా పూతకు వచ్చిన తోటలకు పెద్దగా ఇబ్బందులేమి లేకపోగా, పూత ఆలస్యంగా వచ్చిన తోటల్లో మాత్రం దిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- స్వాతి, ఉద్యానవన పంటల శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, పొలాస, జగిత్యాల జిల్లా



మామిడి చెట్లకు ప్రస్తుత సమయంలో పూత ఆలస్యంగా వస్తోంది. వారం రోజుల క్రితం వరకు వాతావరణంలో చల్లదనం ఉండడం వల్ల రాలేదు. ఇప్పటికే సగానికి పైగా పూత రావాల్సి ఉంది. పూత ఇప్పటివరకు రానట్లయితే పొటాషియం నైట్రేట్ అనే రసాయనాన్ని పిచికారి చేయాలి. కొత్త పూత వస్తున్నప్పుడు తేమ మంచు పురుగును గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సంక్రాంతిలోపు పూత వచ్చే అవకాశాలున్నాయి.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జనవరి, 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై మానసిక పరిస్థితి సరిగా లేక ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజుకుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బండారి మోహన్(38) కొంతకాలం నుంచి మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగా లేక జీవితంపై విరక్తి చెంది శనివారం గ్రామంలో ఓ రేకుల షేడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మోహన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

గంగాధర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వేముల బాలమల్లు(46) కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం వరంగల్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందాడు. శనివారం బాలమల్లు భార్య వేముల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శనివారం కారు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన తాళ్ల దేవేందర్ తన అవసరాల నిమిత్తం బైక్‌పై కేశవపట్నం వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో తాడికల్ పాత సినిమా టాకీస్ ఎదురుగా కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. కిందపడిన దేవేందర్ తలకు, కుడి చేయికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది కరీంనగర్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లి గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బందెల రాజశేఖర్ అనే వ్యక్తి గాయాలపాయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాజశేఖర్ పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డాడు. స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా పెద్దపల్లికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం పర్మిట్‌గదిలో వృద్ధుడి మృతి

కరీంనగర్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భగత్‌నగర్‌లోని ఒక వైన్‌షాపునకు అనుబంధంగా ఉన్న పర్మిట్ గదిలో భగత్‌నగర్‌కు చెందిన వృద్ధుడు మహ్మద్ యూనిస్(63) శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఒకటో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్మిట్ గదిలో సప్లయర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసగా మారిన యూనిస్‌ను నిర్వాహకులు నాలుగు రోజుల కిందట పని మాన్పించారన్నారు. అయినప్పటికీ శనివారం మధ్యాహ్నం బయట మద్యం సేవించిన యూనిస్ పర్మిట్ గదిలోకి వెళ్లి కిందపడిపోగా, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే యూనిస్ మృతి చెందాడు. మద్యం బాగా తాగడం లేదా అనారోగ్యంతో యూనిస్ మృతిచెంది ఉంటాడని అతడి కొడుకు రహీం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోరుట్ల పట్టణంలో వరుస చోరీలు


చోరీ జరిగిన దుకాణ సముదాయం

కోరుట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో వరుస చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులో ఉన్న మూడు దుకాణ సముదాయాల షెటర్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి పగులగొట్టిన చోరీకి పాల్పడ్డారు. ఓం దుర్గా ఆటో మొబైల్, కిడ్స్ మాల్, రాందేవ్ ప్లైవుడ్ దుకాణాల సముదాయాల షెటర్లను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. కౌంటర్లలో ఉన్న సుమారు 12,000 నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణ సముదాయంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

వేములవాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డబ్బు తీసుకొని భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ బి వీరప్రసాద్ తెలిపారు. మారుపాక గ్రామానికి చెందిన గడ్డి నాగరాజు, బచ్చు వంశీకృష్ణ అనే వ్యక్తులు వేములవాడ పట్టణానికి చెందిన కొండ దేవయ్య, కొండ నర్సయ్య సోదరుల దగ్గర ఎకరం ఇరవై గుంటల భూమి కొనుగోలు కోసం మూడు కోట్ల ఐదు లక్షలు రూపాయలు చెల్లించారన్నారు. కొండ దేవయ్య, కొండ నరసయ్య ఒక ఎకరం భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, మిగతా 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఎన్నిసార్లు అడిగినా చేయలేదని, పైగా తమను బెదిరిస్తున్నారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండ దేవయ్య, కొండ నర్సయ్యలపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

- కొండగట్టు ఆలయానికి ఇద్దరు ఈవోల నియామకం
- ముందుగా వేములవాడ ఈవో.. మరోసారి వరంగల్ డీసీ
- గందరగోళంగా దేవాదాయ శాఖ తీరు

మల్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో నియామకంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల మధ్య సమన్వయలోపం గందరగోళంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొండగట్టు ఈవో బదిలీ కావడంతో మరొకరి నియామకం కోసం గురువారం దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ప్రభుత్వం మరొకరిని నియమిస్తూ జీవో జారీ చేసింది. దీంతో అధికారుల తీరు సర్వాత్రా విస్మయం కలిగించింది. కొండగట్టు ఈవో రామకృష్ణరావును బదిలీ చేస్తూ ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం కమిషనర్ తరుపున దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం రామకృష్ణరావు కొండగట్టు నుంచి రిలీవ్ కాగా వినోద్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. మళ్లీ సాయంత్రం వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ టి శ్రీకాంత్‌రావును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ జీవో జారీ చేశారు. రోజుకో ఉత్తర్వు జారీ కావడంతో దేవాదాయ శాఖ అధికార వర్గాల్లో అయోమయం నెలకొంది.

ఈవోగా బాధ్యతలు చేపట్టిన వినోద్


బాధత్యలు చేపడుతున్న వినోద్

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె వినోద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఈవో ఎం రామకృష్ణరావు సికింద్రాబాద్‌లోని గణేశ్ టెంపుల్ ఈవోగా బదిలీ కావడంతో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం ఈవో వినోద్‌ను ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు అభినందించారు.

అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్

- సస్పెన్షన్‌లో ఉన్న తహసీల్దార్ రిమాండ్

చందుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు చెందిన భూమిని మరో వ్యక్తి పేరు మీదకి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో సస్పెన్షన్‌లో ఉన్న తహసీల్దార్‌ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు శనివారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన సంటి లస్మవ్వకు గ్రామ శివారులోని సర్వే నంబరు 322/4/1లో ఎకరం భూమి ఉంది. ఆ భూమిలో 40 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటోంది. రైతు బంధు డబ్బులు రాకపోవడంతో లస్మవ్వ కూతురు ప్రమీల అధికారులను సంప్రదించింది. ధరణి పోర్టల్‌లో 40 గుంటలకు బదులు ఆరు గుంటలు మాత్రమే చూపించడంతో చందుర్తి రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేసింది. మిగతా 34 గుంటల వ్యవసాయ భూమిని మల్యాల గ్రామానికి చెందిన గోంటి రాజానర్సుపై అప్పటి తహసీల్దార్ నరేష్ 2018-19లో అక్రమంగా పట్టా మార్పు చేసినట్లు గుర్తించింది. తన తల్లి లస్మవ్వ పేరుపై ఉన్న ఎకరం భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న గొంటి రాజనర్సు, పట్టా మార్పు చేసిన అప్పటి తహసీల్దార్ నరేష్‌తోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని 27 నవంబరు 2024న ఫిర్యాదు చేసింది. అప్పటికే తహసీల్దార్ నరేష్‌పై రెండు అక్రమంగా పట్టా చేసిన కేసులు ఉన్నట్లు, తాజాగా లస్మవ్వ భూమి అక్రమ పట్టా కేసులో శనివారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టా మార్పు చేయించుకున్న గుంటి రాజనర్సు మృతి చెందగా మరో నలుగురిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు రిటైర్డ్ తహసీల్దార్లపై కేసు

జిల్లాలోని చందుర్తి మండలం ఎనగల్, మల్యాల గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా పట్టా చేసి రిటైర్మెంటైన మరో ఇద్దరు తహసీల్దార్లపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎనగల్ గ్రామంలోని సర్వే నంబరు 516లో గుంటి రాజయ్యకు చెందిన భూమిలో 5 గుంటల స్థలాన్ని గుంటి గంగయ్యకు, మల్యాల గ్రామంలో నేరెళ్ల ఎల్లయ్యకు చెందిన సర్వే నంబరు 893లో 18 గుంటల భూమిని పత్తిపాక దేవ రాజుకు నిబంధనలకు విరుద్ధంగా పట్టా మార్పిడి చేయడంపై బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరు రిటైర్డ్ తహసీల్దార్లపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పు చెల్లించాలని వేధింపులు.. మహిళ ఆత్మహత్య

- సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం


భారతి(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో ఓ మహిళ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిలగాని భారతి (56) శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం సుల్తానాబాద్ కోర్టు ఆవరణలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. గాంధీనగర్‌కు చెందిన తమ సమీప బంధువు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండా మురళి అప్పు చెల్లించాలని వేధించడంతోనే భారతి అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం మూడు లక్షల అప్పు తీసుకోగా ఇప్పటికే ఆరు లక్ష లు చెల్లించామని, ఇంకా రెండు లక్షలు ఇవ్వాలని వేధిస్తున్నాడని పేర్కొన్నారు.

నాయకుడి ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన..

అప్పు చెల్లించాలని వేధించడంతోనే భారతి ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు మురళి ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన చేశారు. పోలీసుల జోక్యంతో వారు ఆందోళన విరమించారు.

ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన చెత్త

- పంట పొలాల గుండా ప్రవహిస్తున్న నీరు - ఆందోళనలో రైతులు

రాయికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువలో చెత్తాచెదారం పేరుకోయింది. దీంతో కాలువకు విడుదల చేసిన నీరు తూముల నుంచి వెళ్లలేక రైతులు వేసిన పంట పొలాల గుండా ప్రవహిస్తున్నాయి. దీంతో నాట్లు వేసిన కొందరు రైతుల పంటలతో పాటు వీరి చుట్టూ ఉన్న దాదాపు 20 నుంచి 50 ఎకరాలపైగా పంట నష్టం జరిగింది. వరి నాట్లకు ముందు చదును చేసిన బురద మన్ను మొత్తం కొట్టుకుపోవ డంతో భూమి సారవంతంతో పాటు ఉన్న పోషకాలు కొట్టుకుపోయాయని, మళ్లీ తిరిగి నాట్లు వేసే సమయం, పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అపార నష్టాన్ని అధికారులు గుర్తించి పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. అప్పట్లో కాలువ నీరు అందరికీ చేరేవిధంగా లష్కర్లు నీటి విడుదల ముందే కాలువల పరిస్థితిని పరిశీలించి తూముల గుండా ఎలాంటి ఆటంకం లేకుండా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకునేవారనీ, ఇప్పుడు కాలువల పరిశీలన చేసే నాథుడే లేడని, అందువల్లనే ఇప్పుడీ పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని మండల అధికారులను కోరారు.


పంట పొలాల నుంచి ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ కాలువ నీరు

పెరుగుతున్న సైబర్ నేరాలు



- ఏపీకే ఫైల్స్ క్లిక్ చేస్తే హ్యాకర్ల చేతిలోకి సమాచారం
- పీఎం కిసాన్ లింకులతో పలువురి ఫోన్‌లు హ్యాక్

గన్నేరువరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మలుచుకుని నకిలీ లింకులు పంపుతున్నారు. ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ ప్రజల సొమ్మును సులువుగా ఖాతాల్లోంచి దోచే స్తున్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమా లను నిర్వహిస్తున్నా బాధితులు రోజు రోజుకూ పెరుగుతూనే ఉండడంతో ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ గ్రూపుల ద్వారా పలు ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల పేరిట ఏపీకే ఫైల్స్ లింకులను పంపుతూ ఫోన్‌లను హ్యాక్ చేస్తున్నారు.

గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామా ల్లో ఇటీవల సైబర్ నేరగాళ్లు పంపించిన పీఎం కిసాన్ లింకులతో మండలంలో పదుల సంఖ్యలో పలువురి ఫోన్‌లు హాక్ అయ్యాయి. హ్యాక్‌కు గురైన ఫోన్ నంబర్ నుంచి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపులలో పీఎం కిసాన్ లింక్ వచ్చింది. దీంతో పీఎం కిసాన్ డబ్బులు తమ ఖాతాలో పడేందుకు అప్‌డేట్ కోసమనే ఆలోచనతో కొందరు ఆ లింక్‌ను ఓపెన్ చేశారు. వెంటనే వారి ఫోన్‌లో వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యాప్‌లు పనిచేయకపో వడంతో తమ ఫోన్‌లు హ్యాక్ అయ్యాయని గుర్తించారు. హ్యాక్ అయిన విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలిపి వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టించారు. గుండ్లపల్లిలో ఓ మహిళకు హెల్త్ ఇన్సూరెన్స్ క్లైం డబ్బులు వచ్చాయని మీ ఫోన్‌పే నంబర్ నుంచి రిక్వెస్ట్ పెట్టమని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో ఆమె వెంటనే తన ఫోన్ నుండి రిక్వెస్ట్ పంపింది. దీంతో వెంటనే తన ఖాతా నుంచి 92 వేలు హ్యాకర్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. వెంటనే గుర్తించిన మహిళ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని హ్యాకర్ల నుంచి 82 వేలు రికవరీ చేశారు. సాంబయపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ క్రైం బారిన పడి లక్షా పదిహేడు వేలు పోగొట్టుకు న్నాడు. అతడు వెంటనే స్పందించ కుండా నాలుగో రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రికవరీ చేయలేకపోయారు.

ఏపీకె లింకులు ఓపెన్ చేయొద్దు

- ఎస్ఐ తాండ్ర నరేష్, గన్నేరువరం



స్మార్ట్ ఫోన్‌ల ద్వారా వివిధ యాప్‌ల పేరుతో, ఏపీకె లింక్‌లను పంపిస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఏపీకె లింకులు చాలా ప్రమాదకరం ఒకసారి ఓపెన్ చేశామంటే ఫోన్ మొత్తం హ్యాకర్ల గుప్పిట్లోకి వెళ్ళి ఫోన్ ఆపరేట్ చేస్తారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలు, ఏపీకె ఫైల్స్ చూసి మోసపోవద్దు. లక్కీ స్కీంల పేరిట ప్రలోభపెట్టినా పట్టించుకోవద్దు. వివిధ రూపాల్లో తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపి చెప్పమని, డబ్బులు పంపమని అడిగితే కచ్చితంగా తమను మోసపుచ్చుతున్నారని గుర్తించాలి. నిరుద్యోగులు, మహిళలు అవగాహన లేకుండా సోషల్ మీడియా ద్వారా ఏపీ డౌన్‌లోడ్ చేసుకోవద్దు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలి.


సంతూర్ లోగో ముగ్గు వేస్తున్న మహిళ


సెల్సియా, పెర్‌ఫెక్టు లోగో ముగ్గు వేస్తున్న మహిళ


పాపను ఎత్తుకుని ముగ్గు వేస్తున్న యువతి


ఏబీఎన్ పేరుతో వేసిన ముగ్గు


ముగ్గు వేస్తున్న మహిళ

పెద్దపల్లి జిల్లాలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'
ముత్యాల ముగ్గుల పోటీ


ముగ్గులు వేస్తున్న మహిళలు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' పోటీలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పోటీలకు 92 మంది మహిళలు హాజరయ్యారు. వీరు వేసిన ముగ్గులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అందమైన ముగ్గులకు మొదటి, రెండు, మూడవ బహుమతులు ఇవ్వగా 20 మందికి కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ బహుమతులు ఇచ్చారు.

\- పెద్దపల్లి, ఆంధ్రజ్యోతి


లోగో ముగ్గులు వేసిన వారికి బహుమతులను అందజేస్తున్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సంపత్ కుమార్


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు చిరుదు సమత, వనజ, మంగాదేవి, కవిత

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

భగత్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడు జె వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఐ పార్టీ జిల్లాకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు ఆర్థిక పరిస్థితి సరిగా లేదని కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో గీట్ల ముకుందరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, బీమాసాహెబ్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, జి రాజేశం, నరేష్ పటేల్, శీలం అశోక్, కె నాగమణి, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

మంథని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మంథని జేకేఏ షోటోకాన్ క్రీడాకారులు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించనట్లు కోచ్ కొండ్ర నాగరాజు శనివారం తెలిపారు. డిసెంబరు 31 నుంచి జనవరి 3 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తన ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారుల్లో 60 కేజీల విభాగంలో పైడిపాటి బాబీవర్మ సిల్వర్ మెడల్, దుల్‌గచ్ దేవాన్ష్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన బాబీవర్మకు ప్రభుత్వం రూ. 15 వేల నగదు ప్రోత్సాహక బహుమతిగా ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర పోటీల్లో మెడల్స్ సాధించిన బాబీవర్మ, దేవాన్ష్, కోచ్ కొండ్ర నాగరాజులను జేకేఏ సౌత్ జోన్ ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, ఇండియా కోచ్ కీర్తన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, కియో రాష్ట్ర ట్రైనర్ మల్యాల రామస్వామి, పెద్దపల్లి జిల్లా ఎస్ జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, శంకర్‌గౌడ్ అభినందించారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధికి చర్యలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,
- వేములవాడ ఆలయ అభివృద్ధిపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పక్కన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంగా వేములవాడ అభివృద్ధి అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ ఆలయ కార్యాలయంలో ఫర్నీచర్ కొనుగోలు చేయాలని, సంవత్సరం క్రితం ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు జరగలేదని మండిపడ్డారు. సంక్రాంతి నాటికి అన్నదాన భోజన హాల్, సమావేశ మందిరంలో నూతన ఫర్నీచర్ అందుబాటులోకి తేవాలని అన్నారు. భక్తుల వసతి కోసం సూట్ రూమ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

బద్దిపోచమ్మ ఆలయ పునర్‌నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రూ. 12 కోట్లతో గుడిచెరువు, మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి, నీటిసరఫరా, వాకింగ్ ట్రాక్, విద్యుత్ వంటి పనులు శివరాత్రి ముందు ప్రారంభం కావాలని అన్నారు. శివార్చన వేదిక, వంద ఫీట్ల రోడ్ల విస్తరణ పనులు శివరాత్రి నాటికి పూర్తి కావాలన్నారు ఆలయ విస్తరణకు సంబంధించి డీపీఆర్ పనులు నెలాఖరు నాటికి అందించాలని, అన్నదానసత్ర భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని ఆదేశించా రు. అంబేద్కర్ జంక్షన్ వద్ద అభివృద్ధి పనులు కొనసాగించి అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించి అవసరమైన ఫర్నీచర్‌ను వెంటనే షార్ట్ టెండర్లు పిలిచి మూడు రోజుల్లోగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

10న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

- స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 10వ తేది శుక్రవారం రోజున ముక్కోటి ఏకాదశి ఉత్సవము నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు శనివారం తెలిపారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 3.10 గంటల నుంచి 3.40 గంటల వరకు సుప్రభాతం, 3.40 గంటల నుంచి 3.50 గంటల వరకు ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. ఉదయం 3.50 గంటల నుంచి ఐదు గంటల వరకు స్వామి వారికి ప్రాతఃకాల పూజ, 5.10 గంటల నుంచి స్వామి వారలు ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశ అనంతరం భక్తులకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనము కల్పించనున్నట్లు తెలిపారు.

అనంతరం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభిషేకము టికెట్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అన్నపూజ సేవా టికెట్లు యథావిధిగా కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాపారులకు పోలీసుల పేరుతో
సైబర్ నేరగాళ్ల ఫోన్లు

» చోరీ సొత్తు కొన్నారని బెదిరింపులు » డబ్బులు పంపితే కేసులు ఉండవని నమ్మించే యత్నం


మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బులియన్ మార్కెట్‌లోని పలువురు వ్యాపారులకు శనివారం పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేశారు. మీరు చోరీ సొత్తు కొన్నారు.. నిబంధనలకు విరుద్ధంగా నగలు కుదువపెట్టుకున్నారని, మీో ై కేసు నమోదు అయ్యిందంటూ బెదిరిం పులకు దిగారు. అరెస్టు కాకుండా ఉండాలంటే తాము చెప్పిన నెంబర్‌కు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాలని, అది కూడా త్వరగా పంపాలంటూ హెచ్చరికలు చేశారు. పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఈ తరహా ఫోన్లు రావడంతో కొంత గందరగోళానికి లోనయ్యారు. తరువాత తేరుకుని సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించారు. కొన్ని రోజుల క్రితం తాము నగరపాలక సంస్థ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్ పెనాల్టీ పడుతుందని, ఒకేసారి చెల్లిస్తే మాఫీ చేస్తామంటూ వ్యాపారులను నమ్మించారు. ఇదే తరహాలో బులియన్ మార్కెట్‌లకు ఫోన్లు వచ్చాయి. గోదావరిఖని బులియన్ మార్కెట్‌లో . సీఐ ఇంద్రసేనారెడ్డి వ్యాపారులు, నగల తయారీదారులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న పురుషోత్తం

తిమ్మాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపవద్దని చెప్పారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ు. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్‌చక్రవర్తి, సీనియర్ ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హరిత, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా రవికుమార్


రవికుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన వీసీ ఉమేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రవికుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శాతవాహన యూనివర్సి టీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తన బాధ్యత అని అన్నారు. రిజిస్ట్రార్ రవికుమార్‌కు 24 సంవత్సరాల బోధన అనుభవం ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో 40 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఏడు పుస్తకాలను రచించారు. ప్రస్తుతం తెలంగాణ కామర్స్ అసోసియేషన్‌కు జనరల్ సెక్రెటరీగా, ఇండియన్ కామర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. ఈయన గతంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో కామర్స్ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగానికి అధిపతిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రొఫెసర్ జి రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు డైరెక్టరేట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజెస్, ఉస్మానియా యూనివర్శిటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ వరప్రసాద్ శాతవాహన యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు.

రాజన్నను దర్శించుకున్న ఏసీపీ

వేములవాడ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ముందుగా రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి ప్రసాదం అందజేశారు.

స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్‌గా కిషోర్‌రెడ్డి

ధర్మారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణసంస్థ (ఎస్ఆర్‌టీఆర్‌ఐ) చైర్మన్‌గా ధర్మారం మండల కేంద్రానికి చెందిన నార కిషోర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కిషోర్‌రెడ్డి ప్రస్తుతం ఎస్ఆర్‌టీఆర్‌ఐకి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్ఆర్‌టీఆర్‌ఐకి తనను చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వానికి కిషోర్‌రెడ్డి అభ్యర్థన పెట్టుకోగా పరిశీలించిన ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా నియాకమైన కిషోర్‌రెడ్డి 3 ఏళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. తన నియామానికి సహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులను కదిలించిన వంటా వార్పు


విచారణ జరుపుతున్న ఆర్డీవో గంగయ్య, తదితరులు

పాలకుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల, రాణాపూర్, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ గౌడ కుల సంఘాల నాయకులు, పలువురు ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఎన్‌టీపీసీకి చెందిన బూడిద చెరువు వద్ద నిర్వహించిన వంటావార్పు కార్యక్రమం పలు ప్రభుత్వ శాఖల అధికారులను కదిలించింది. ఆయా గ్రామాల్లో గల వందలాది ఎకరాల్లో ఉన్న ఈత, తాటి చెట్లను ఎన్టీపీసీ యాజమాన్యం అన్యాయంగా భారీ మిషన్ల సహాయంతో తొలగించడాన్ని నిరసిస్తూ రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ ఎం జ్యోతి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చదరంగంలో గని కార్మికుడి ప్రతిభ

కోల్ ఇండియా స్థాయిలో రాణిస్తున్న మర్రి మహేందర్



▲చెస్ ఆడుతున్న మర్రి మహేందర్
గని కార్మికుడిగా విధుల్లో మర్రి మహేందర్


ఆలిండియా పబ్లిక్ సెక్టార్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బహుమతి అందుకున్న మహేందర్(ఫైల్)

కోల్‌సిటీటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన సింగరేణి గని కార్మికుడు మర్రి మహేందర్ చదరంగం క్రీడలో రాణిస్తున్నాడు. ఆర్‌జీ-1లోని జీడీకే 11 ఇంక్లయిన్‌లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌కు పదేళ్ళ వయస్సులో చెస్ ఆటపై ఆసక్తి కలిగింది. ఓవైపు మెడికల్ షాపులో పనిచేస్తూనే చెస్ క్రీడకు సంబంధించిన బుక్స్ చదివి మెళకువ లు నేర్చుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ రేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 1623 రేటింగ్ సాధించాడు. తండ్రి అయిలయ్య సింగరేణిలో రిటైర్ అయ్యాక గని కార్మికుడిగా విధుల్లో చేరాడు. చెస్‌పై ఉన్న ఇష్టంతో సింగరేణిలో నిర్వహించే చదరంగం పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నాడు. రెండుసార్లు కోలిండియా స్థాయి చెస్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. కంపెనీ స్థాయిలో మూడుసార్లు చెస్ చాంపియన్‌షిప్‌ను సాధించాడు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ధర్మారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల ఆదర్శ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బి.సింధుప్రియ డిసెంబరు 10 నుంచి 12 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో సింధుప్రియ పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు తదితరులు అభినందించారు.

న్యూస్ బాక్స్

పాండవుల గుట్టపై బోర్డు ఏర్పాటు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 597 సర్వే నంబర్‌గల పాండవుల గుట్ట కబ్జాకు గురవుతుండడంతో రెవెన్యూఅధికారులు బోర్డు ఏర్పాటుచేశారు. పాండవుల గుట్టను కొందరు ఎక్స్‌వేటర్‌తో చదును చేయించుకొని కబ్జా చేస్తున్నారు. ఈవిషయంపై సంబంధిత రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఎండీ వకీల్ పాండవుల గుట్టకు బోర్డు ఏర్పాటుచేశారు. ఎవరైనా భూమిలో అక్రమంగా మట్టి తీసినా, పాండవుల గుట్ట భూమిని కబ్జా చేసినా మాకు గ్రామస్థులు తెలియజేయాలన్నారు.

టేలాల నిర్వాహకులకు నోటీసులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నీకంటచెరువు శిఖంలో ఉన్న టేలాల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీవో కిరణ్ తెలిపారు. గతంలో చెరువులో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. బస్సులు ఆగేందుకు కొంతస్థలం కేటాయించి గ్రామపంచాయతీ సిబ్బంది మొరం పోయించారు. ఆ స్థలంలో ఇటీవల కొందరు అధికారులను మచ్చిక చేసుకొని టేలాలు వేశారు. చెరువు శిఖంలో గతంలో కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన లలిత నివాసం ఏర్పరుచుకోగా అధికారులు ఖాళీ చేయించారు. తిరిగి గుడిసె వేసుకునే ప్రయత్నం చేయగా జీపీ సిబ్బంది తొలగించారు. అలాగే టేలాలు పెట్టిన వారికి నోటీసులు జారీ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

సేవలు పునఃప్రారంభం

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : ప్రతిమ హాస్పిటల్ ఉచిత సేవలను పునఃప్రారంభించినట్లు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సదానందం తెలిపారు. శనివారం మండలంలోని కల్వచర్లలో ప్రతిమ హాస్పిటల్ ఉచిత ఆరోగ్య సేవలపై కరపత్రాలను పంపిణీ చేపట్టారు. ఉమ్మడి కమాన్‌పూర్, మంథని మండలాలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఆరోగ్య పరీక్షలకు ఉచిత ఓపీ సేవలు, బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత సేవలతో కూడిన కరపత్రాలను పంపిణి చేపట్టారు.

వ్యాసరచన పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఈవీఎస్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈవీఎస్ ఎన్‌జీఓ చైర్మన్ ఇరికి మహేష్, జక్కుల దామోదర్‌రావు, దేవనపల్లి చక్రపాణి, సాగర్, అవినాష్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్జీ-2 ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో శిక్షార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నేత్ర, శరీర, అవయవ దానాలపై వివరించారు. మరణానంతరం నేత్రదానం వలన ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ఈసందర్భంగా 45 మంది యువ ఉద్యోగులు నేత్ర దానానికి అంగీకారం తెలపగా డోనర్ కార్డులు అందజేశారు.ఎంవీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ లయన్స్‌క్లబ్ వారు పలువురు న్యాయవాదులను సన్మానించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పడాల శ్రీరాములు, సీనియర్ న్యాయవాది అవుల లక్ష్మీరాజం యాదవ్, వారి కుమారుడు శివకుమార్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, వల్లా నీలయ్య, వెంకటేశ్, సాంబమూర్తి, సతీష్, సదానందం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అవనిపై విరిసిన హరివిల్లు..

(5వ పేజీ తరువాయి)

అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అందజేశారు. న్యాయ నిర్ణేతలు రిటైర్డ్ హెచ్‌ఎం వనజ, తెలుగు ఉపాధ్యాయురాలు మంగాదేవి, హిందీ పండిట్ కవిత, అల్ఫోర్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సత్యం, ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బుర్ర సంపత్ కుమార్‌గౌడ్, ఆంధ్రజ్యోతి రిపోర్టర్లు సాదుల సుగుణాకర్, బుర్ర తిరుపతి, చింతకింద చంద్రమొగిలి, సీపెల్లి రాజేశం, నాగులమల్యాల శివాచారి, రామిడి మృత్యుంజయం, ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు ఎండీ షుకూర్, ఏబీఎన్ వీడియోజర్నలిస్టు పి కుమార్, సర్క్యూలేషన్ సిబ్బంది రమేష్, సంతోష్, అల్ఫోర్స్ సిబ్బంది బైరి రవీందర్, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతే లక్ష్యం..

- సీపెల్లి ఇందు, గోదావరిఖని, మొదటి బహుమతి విజేత



రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడమే లక్ష్యంగా పోటీలో పాల్గొన్నా. ఏబీఎన్ 'ఆంధ్రజ్యోతి' ప్రతి ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు పది సంవత్సరాల నుంచి హాజరవుతున్నాను. ఈరోజు సుల్తానాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి రావడం ఎంతో సంతోషంగా ఉంది. గత ఏడాది పెద్దపల్లిలో రెండవ బహుమతి గెలుపొందగా, ఈసారి మాత్రం రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించాలనే పట్టుదలతో ఇక్కడ మొదటి బహుమతి గెలుచుకున్నాను. నేను వేసిన ముగ్గు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతుందని ఆశిస్తున్నాను.

పద్నాలుగేళ్లుగా పోటీలో పాల్గొంటున్నా..

- గాదె లలిత, ఎలిగేడు, రెండవ బహుమతి విజేత



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలకు గత 14 సంవత్సరాల నుంచి హాజరవుతున్నాను. వివిధ జిల్లాల్లో నిర్వహించిన పోటీలలో పాల్గొని మొదటి, మూడవ బహుమతులను గెలుచుకున్నాను. సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీలలో రెండవ బహుమతి సాధించడంతో మూడు బహుమతులు సాధించిన సంతృప్తి పొందాను. రానున్న కాలంలో సరికొత్త ఆలోచనలు, పండుగ నేపథ్యం, సామాజిక అంశాలతో ముగ్గులు వేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడమే లక్ష్యంగా ముందుకు వెళతాను.

మహిళలను ప్రోత్సహిస్తున్నారు..

- పందిర్ల స్వప్న, కరీంనగర్, మూడవ బహుమతి విజేత



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వారు ఏటా ముగ్గుల పోటీ నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మాలాంటి మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఈ పోటీల ద్వారా నేను రాష్ట్రస్థాయి బహుమతి సాధించాలనే లక్ష్యంగా పాల్గొంటున్నాను. గతంలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. ఈసారి ఎలాగైనా ప్రథమ బహుమతి సాధించాలని వచ్చాను. కానీ తృతీయ బహుమతి వచ్చింది. భవిష్యత్‌లో అందరి కంటే వివిధ నేపథ్యాలతో అందంగా, ఆకట్టుకునేలా ముగ్గులు వేసి రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను.

'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సిల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్).. స్థానిక పార్టనర్ అల్ఫోర్స్ హైస్కూల్ సుల్తానాబాద్ పోటీల్లో ప్రత్యేక, కన్సోలేషన్ బహుమతి అందుకుంటున్న మహిళలు, విద్యార్థినులు..



బి విజయలక్ష్మికి ప్రత్యేక బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు



కె జాహ్నవి, పి స్రవంతి, సరిత, బి వనిత, కె దివ్య, జి నందిని, ఎస్ రమాదేవి, కె నందిని, కె లావణ్య, పి మాధవి,



ఎస్ అలేఖ్య, డి సుమలత, జె దివ్య, పి శ్రీలత, డి స్రవంతి, ఆర్ ప్రశాంతి, సుంక స్వప్న, నల్ల సంధ్య, శ్రీలత, సీహెచ్ లావణ్య

దోషులకు శిక్ష పడడంలో బాధ్యతగా వ్యవహరించాలి : సీపీ

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను పోలీసులు ఎస్కార్ట్ ద్వారా జాగ్రత్తలు పాటిస్తూ తీసుకురావాలని, నేరస్థులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సీపీ సూచించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా దోషులకు శిక్ష పడడంతో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత చాలా కీలకమైనదని, నేరస్థులకు వారెంట్స్, సమన్లు సత్వరమే ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలని, పబ్లిక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు సీసీటీఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటే బాధితులపై మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు సుందర్‌రావు, ప్రసాద్, లీగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సీసీఆర్‌బీసీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో పాటు పెద్దపల్లి, మంచిర్యాలజోన్‌ల కోర్టు డ్యూటీఆఫీసర్లు పాల్గొన్నారు.

మావోయిస్టు కదలికలపై అప్రమత్తం..

మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ పార్టీ పోలీసులకు రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. శనివారం కమిషనరేట్‌లో స్పెషల్ పార్టీ సిబ్బందికి గ్రేహౌండ్స్ తరహా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రేహౌండ్స్ వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, మావోయిస్టుల ఏరివేతకు, వారికి ఇచ్చే శిక్షణను స్పెషల్ పార్టీ పోలీసులకు ఇస్తున్నట్టు చెప్పారు. సిబ్బంది ఫిజికల్ ఫిట్‌నెస్, స్క్వాడ్ డ్రిల్, ఆయుధ వినియోగం, కోల్‌నా, జోల్‌నా, ఆర్మ్‌డ్ డ్రిల్, ఫాట్స్ నేమ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, సంపత్, మల్లేషం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గణేషుని మండపాన్ని కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు

ఓదెల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీలకుంటలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న గణేశుడి మండపాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నేలకూల్చారు. గత కొద్దిరోజుల నుంచి వివాదాస్పదంగా ఉన్న గణేశుని మండప స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేశారు. ఈమేరకు రెవెన్యూ, పోలీస్ శాఖలు రక్షణగా ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వ భూమిలో గతంలో మండపాన్ని నిర్మించగా ఇదే భూమిని ఇక్కడి వ్యక్తి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని గత కొంతకాలంగా కలెక్టర్‌కు, తహసీల్దార్ యాకయ్యకు గణేశుని మండప కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తున్నారు. అనంతరం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూమిని పరిశీలించి ఇది ప్రభుత్వ భూమిగా అధికారులు నిర్ధారించారు. ఎలాంటి ఆక్రమణకు పాల్పడవద్దని హెచ్చరించారు. గణపతి నవరాత్రులు, దుర్గ మాత నవరాత్రులు నిర్వహిస్తూ కమిటీ ఆధ్వర్యంలో మండపాన్ని కాపాడుకుంటున్నారు. అధికారులు హెచ్చరించిన కొద్దిరోజులకు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి మండపాన్ని కూల్చివేయడంతో మళ్లీ జీలకుంటలో ఉద్రిక్తపరిస్థితులు చోటుచేసుకున్నాయి. దీంతో పొత్కపల్లి ఎస్ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశారు. గణేశుని మండప కమిటీ చైర్మన్ దార విజయేందర్ ఆధ్వర్యంలో పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆపదలో ఉన్న విద్యార్థికి ఆర్థిక సహాయం

ఓదెల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్‌కు చెందిన కొల్లూరి నందిని అనే విద్యార్థికి శనివారం మన ఊరు, మనబడి వేదిక ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు రూ20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నందిని హాస్టల్లో ఉంటు చదువుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తున కింద పడడంతో వెన్నెముకకు గాయమైంది. పరిస్థితిని తెలుసుకున్న మన ఊరు, మనబడి వేదిక పూర్వపు విద్యార్థులు స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. జీగురు ఐలయ్య, ఆర్పీఎఫ్ సీఐ కొదురుపాక రాజేందర్ ప్రసాద్, ఎంఈవోలు రమేష్, రాజయ్య ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణమూర్తి, హెచ్‌ఎంలు ఏసుదాసు, లక్ష్మణస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మతి స్థితిమితం లేని యువకుడికి సపర్యలు..

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తన పుట్టిన రోజు సందర్భంగా సుల్తానాబాద్‌కు చెందిన సామాజిక సేవకుడు, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ డాక్టర్ ఐల రమేష్ శనివారం మతి స్థితిమితం శంకర్ అనే యువకుడికి సపర్యలు చేశారు. ఉదయం యువకుడికి క్షవరం తీయించి, తన ఇంటికి తీసుకువెళ్లి అతనికి స్నానం చేయించి కొత్త దుస్తులు తొడిగి భోజనం ఏర్పాటు చేశారు. ఇలా పుట్టిన రోజున, పెళ్లి రోజున అందరూ ఏదైనా సేవా కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ రమేష్ సూచించారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

జూలపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పెట్టుబడి సహాయాన్ని 6వేల నుంచి 10వేల రూపాయలకు పెంచినందుకు మండలంలోని పెద్దాపూర్‌లో శనివారం ప్రధానమంత్రి చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కంకనాల జ్యోతిబసు, సంకెండ్ల నర్సయ్య, వడ్లకొండ సంపత్, చిప్ప వెంకటేశం, బద్రయ్య, నరేష్, సురేష్, రాజు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి..



సుల్తానాబాద్ అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో పాశ్చాత్య పోకడలతో మన సంస్కృతీ సంప్రదాయల పట్ల కొంత నిర్లక్ష్యం ఏర్పడుతుందని, ఇలాంటి పరిస్థితికి స్వస్తి చెప్పేందుకే మన పండుగలు వాటి విశిష్టతను కాపాడుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే మన సంస్కృతీ సంప్రదాయల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, పల్లెటూరి వాతావరణం, చేదబావి, పిండి వంటలు, గోదాదేవి కళ్యాణం, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు తదితర అంశాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ : ఎంవీఐ

జ్యోతినగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు తావుండదని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోష్‌రెడ్డి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విశ్వభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఎంవీఐ ప్రసంగించారు. ట్రాఫిక్ నియమాలు, చట్టం, జరిమానాలు, శిక్షలు తదితర అంశాల గురించి ఎంవీఐ, ట్రాఫిక్ సీఐ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెడ్ మాస్టర్ తిరుపతిగౌడ్, ఏఎంవీఐ సీహెచ్.ప్రదీప్ సాగర్, నిఖిల్ కుమార్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ జి.హరిశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి..

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ, వాటి వాడకాన్ని నివారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి కలిందిని అన్నారు. శనివారం మండలంలోని గౌరెడ్డిపేటలో పెద్దపల్లి మున్సిపాలిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం రాఘవపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. నర్సరీని సందర్శించి మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, అధికారులకు సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ రాఘవులు, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు రవి, తిరుపతి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

అప్పన్నపేటలో గ్రామసభ

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపేటలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పనులు, చేయాల్సిన అభివృద్ధి పనులపై సభలో చర్చించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలు..

పెద్దపల్లి కల్చరల్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్ర విద్యాపరిశోధన మండలి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్, జిల్లా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. పి. సింధుజ ప్రథమ, ఆర్. స్నేహిత ద్వితీయ, అర్షిత తృతీయ బహుమతులు పొందారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జిల్లా ఆసుపత్రిలో పెరిగిన సేవలు : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు గణనీయంగా పెరిగాయని, వీటిని జిల్లాల్లోని అవసరమైన రోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సామాజిక ఆసుపత్రి నుంచి జిల్లా ఆసుపత్రికి మారిన నేపథ్యంలో వివిధ రకాల స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వచ్చారని, మౌలిక వసతులు శస్త్రచికిత్సకు అవసరమైన పరికరాలు అందుబాటులో తెచ్చామని తెలిపారు. సంపూర్ణమైన వైద్య సేవలు అందించినందుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, స్పెషలిస్ట్ డాక్టర్ల బృందాన్ని కలెక్టర్ అభినందిస్తు, ఈ వైద్య సేవలను పూర్తిగా ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం..

కళ్యాణ్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలని గౌతమిరూరల్ టెస్ట్ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకురాలు సోమారపు లావణ్య మహిళలకు సూచించారు. శనివారం గౌతమినగర్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో మూడు నెలలుగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతమి రూరల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 27బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.



సొంతింటి పథకంపై ఉద్యమం : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎన్నికల్లో అనేక హామీలిచ్చిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పథకాలపై కార్మికులు ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సింగరేణి ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సొంతింటి పథకం,పెర్క్స్‌మీద ఐటీ మినహాయింపు, మారుపేర్ల మార్పిడి, ప్రభుత్వం రూ.33వేల కోట్ల బకాయిలు వంటి అనేక ప్రధాన సమస్యలను మేనిఫెస్టోలో పెట్టుకొని గెలిచిన సంఘాలు కార్మికులకు జవాబు చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మికుల సమస్య పరిష్కారం కోరుతూ సీఎండీకి వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు దొమ్మటి కొమురయ్య, ఆహ్మద్‌పాషా, ప్రభాకర్, వేణుగోపాల్, సదానందం, క్యాతం రాజేష్, రంజిత్, విజేందర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోచుకుంటున్న సింగరేణి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి పేర్కొన్నారు. శనివారం ఓసీపీ-3 స్టోర్స్‌లో కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో అంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలు పెంచకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. కొత్త రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడిచినా కనీస వేతనాల జీవో అమలు చేయకుండా కార్మికులను ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నట్టు తెలిపారు. 2021 జూన్‌లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీఓ 22ను విడుదల చేసింద ని, మూడున్నర ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు గెజిట్ చేయకుండా కాలయాపన చేస్తున్నట్టు ఉల్లి మొగిలి తెలిపారు. జీవో 22ను గెజిట్ చేసి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని లేదా జేబీసీసీఐ హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. వేతనాలు పెంచకుంటే కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో సీహెచ్ లక్ష్మీనారాయణ, రాంశంకర్, రషీద్‌ఖాన్, వేల్పుల రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో ఛాయాదేవిని సన్మానిస్తున్న విద్యాధికారులు

ఎంఈఓ చాయదేవి సేవలు ఆదర్శప్రాయం..

- ఇన్‌చార్జ్ డీఈఓ హన్మంతు

ధర్మారం జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ధర్మారంలో ఎంఈవోగా పినమళ్ల ఛాయాదేవి అందించిన సేవలు ఆదర్శప్రాయమని పెద్దపల్లి ఇన్‌చార్జ్ డీఈవో వాలుక హన్మంతు అన్నారు. శనివారం ధర్మారం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంఈవో పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామన్య కుటుంబం నుంచి వచ్చినఛాయదేవి జూలపల్లి, ధర్మారం తో పాటు ఆమె పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం ఛాయాదేవిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఉపాధ్యాయుడు జవ్వాజి రాజనర్సయ్య, ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేనిమియా వాగు పరివాహక రైతులకు సాగునీరు : ఎమ్మెల్యే

జూలపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ పెద్దచెరువు నుంచి హుస్సేనిమియావాగు పరివాహక ప్రాంతం ఆయకట్టు రైతుల పంటలకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. మండలంలోని పెద్దాపూర్ పెద్దచెరువును శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు సందర్శించి చెరువులోని నీటి నిలువలను, మత్తడిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాకతీయ కాలువ రేవెల్లి వద్ద నుంచి డి83 ఎస్కేప్ ద్వారా నీటిని తరలించి పెద్దాపూర్ పెద్దచెరువును నింపుతామన్నారు. చెరువు మత్తడి ద్వారా హుస్సేమినియా వాగులోకి నీటిని వదిలి ఆయకట్టు రైతుల పంటలను కాపాడుతామని, సాగునీటి కోసం రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేదని హుస్సేనిమియా ఆయకట్టు ప్రాంత రైతులకు ఎమ్మెల్యే విజయరమణారావు భరోసా కల్పించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు జే.అరుణశ్రీ, డి.వేణు, డీసీపీ చేతనలతో కలిసి పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

బాలికలు మనోబలాన్ని పెంపొందించుకోవాలి..

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యతో పాటు మనోబలాన్ని పెంపొందించుకోవాలని సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ అన్నారు. శనివారం ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా బాలిక సంరక్షణను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం స్కూల్ నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ గేట్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రవి, ఉదయ్ కుమార్, డీన్ రమేష్, ఇన్‌చార్జి నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.